క్లుప్తంగా

నేడు జ్యోతుల మహోత్సవం

కోవెలకుంట్ల: మండలంలోని బిజనవేముల గ్రామంలో మహాలయ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం జ్యోతుల మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామంలోని చౌడేశ్వరీ దేవి ఆలయం ముస్తాబైంది. ఆయా కాలనీలకు చెందిన భక్తులు మంగళవారం అర్ధరాత్రి జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయనున్నారు. జ్యోతుల సందర్భంగా గ్రామంలో పండుగ సందడి నెలకొంది.

ఉపాధ్యాయులకు సన్మానం



బనగానపల్లె రూరల్: ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులందుకున్న పి.ముకుందరెడ్డి, ప్రతాప్, విజయను బనగానపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం సన్మానించారు. ఎంఈఓ స్వరూప మాట్లాడుతూ.. మండలం నుంచి పలువురు ఉపాధ్యాయులకు అవార్డులు దక్కడం సంతోషంగా ఉందన్నారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం బాలగంగధర్‌రెడ్డిను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, సత్యప్రకాష్, సుబ్రమణ్యం, నాగరాజు, జానకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎంఏవై గ్రామీణ్ గృహ ప్రవేశం

ప్యాపిలి: ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం ద్వారా లబ్ధిదారులు నిర్మించుకున్న గృహాలను మంగళవారం ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ మంగళవారం ప్రారంభించారు. కాగా కలచట్ల గ్రామంలో నిర్వహించిన పీఎంఏవై గృహాల ప్రారంభోత్సవానికి స్థానిక హౌసింగ్ కార్యాలయ సిబ్బంది అందరూ తరలివెళ్లారు. కార్యాలయానికి తాళం వేసి వెళ్లడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన లబ్ధిదారులు నిరాశతో వెనుతిరిగి వెళ్లారు.

సంజామల: మండల కేంద్రంలో నిర్మించిన ఇంటిని ఎంపీడీఓ విజయకుమార్ రెడ్డి, తహసీల్దార్ అనీల్ కుమార్ ప్రారంభించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కోవెలకుంట్ల: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను మంగళవారం మండల వ్యవసాయాధికారి నిరంజన్ తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్లు, ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. ఎరువుల నాణ్యతను పరీక్షించేందుకు శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీ నుంచి రబీ సీజన్ ప్రారంభం కానునందని, సీజన్ మొదటి పంటలుగా రైతులు జొన్న, పప్పుశనగ పంటలు విస్తారంగా సాగు చేస్తారన్నారు. ఇందుకోసం రైతులు అధికంగా డీఏపీ ఎరువులను వినియోగిస్తారన్నారు. ఆ ఎరువులో ఉండే నత్రజని, భాస్వరం పోషకాలు కాంప్లెక్స్ ఎరువులైన 20:20:0:13, 14:35:14:10, 26:26:28:28 లాంటి ఎరువుల్లో ఉంటాయని ఈ రకం ఎరువులను జొన్న, శనగ పంటల సాగులో వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫోడియం తొలగింపు



ఫోడియం తొలగించిన తర్వాత విధులు నిర్వర్తిస్తున్న సబ్‌రిజిస్ట్రార్

ప్యాపిలి: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న ఫోడియాన్ని మంగళవారం తొలగించారు. దీంతో సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసరావు ఇతర కార్యాలయ సిబ్బందితో సమానంగా కూర్చొని విధులు నిర్వర్తించారు. ఇది వరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫోడియంలో ఎత్తయిన ప్రదేశంలో సబ్‌రిజిస్ట్రార్‌లు కూర్చొనేవారు. అయితే తాజాగా ప్రజలకు, సబ్‌రిజిస్ట్రార్‌తో స్నేహపూర్వక వాతావరణం ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఫోడియాన్ని తొలగించాలని జీఓ జారీ చేసింది. జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి ఆదేశాల మేరకు ఫోడియంను తొలగించినట్లు సబ్‌రిజిస్ట్రార్ తెలిపారు.

బాక్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



విజయోత్సాహంలో విద్యార్థులు

అవుకు: జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 2024 పోటీల్లో అవుకు మదర్ మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ నెల 15వ తేదీ నంద్యాలలో జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు 56 పతకాలను కైవసం చేసుకున్నారు. బాలికల విభాగంలో 9 బంగారు, 10 వెండి, 10 కాంస్యం, బాలుర విభాగంలో 6 బంగారు, 10 వెండి, 11 కాంస్య పతకాలు సాధించారని కరస్పాండెంట్ శ్రీనివాసులు తెలిపారు. విద్యార్థులను అభినందించారు.



వల్లంపాడు సమీపంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న కప్పలవాగు (ఫైల్). వంతెన లేక రోడ్డుపై ప్రవహిస్తున్న నల్లవాగు (ఫైల్). లింగాల సమీపంలో పాలేరువాగు వంతెనపై ప్రవహిస్తున్న వరదనీరు(ఫైల్)

వంతెన కష్టాలు

- చిన్నపాటి వర్షానికే ఉప్పొంగుతున్న వాగులు
- లోలెవల్ వంతెనలతో తప్పని అగచాట్లు
- కోవెలకుంట్ల–లింగాల రహదారిలో రాకపోకలకు ఆటంకం
- ఆర్‌అండ్‌బీ మంత్రి చొరవ చూపేనా?

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–లింగాల ఆర్‌అండ్‌బీ రహదారిలో పలు గ్రామాల ప్రజలను వంతెన కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ రహదారిలో వివిధ వాగులపై కొన్నిచోట్ల వంతెనలు లేకపోవడం, మరి కొన్ని చోట్ల లోలెవల్ వంతెనలు ఉండడంతో కుందూనదికి ఓ మోస్తారు వరద వచ్చినా ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఏటా వర్షాకాలంలో వాగులకు వరద ఉధృతి చేరడంతో ఈ రహదారిలో రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ఇటీవల శ్రీశైలం జలాశయానికి వరదనీరు పోటెత్తడంతో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి కుందూదికి భారీగా నీటిని విడుదల చేయడంతో వారం పాటు వరదనీరు వాగులను ముంచెత్తింది. రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

లోలెవల్ వంతెనలతో ఇబ్బందులు

కోవెలకుంట్ల– లింగాల ఆర్‌అండ్‌బీ రహదారిలోని వల్లంపాడు సమీపంలో కప్పలవాగు ప్రవహిస్తోంది. ఈ వాగుపై లోలెవల్ వంతెన కావడంతో కుందూనదికి ఓ మోస్తారు నీటిని విడుదల చేసినా వాగు పొంగి ప్రవహిస్తోంది. ఫలితంగా రాకపోకలు నిలిచిపోతున్నాయి. లింగాల మీదుగా ఇతర గ్రామాల ప్రజలు గ్రామానికి రావాలన్నా వల్లంపాడు ప్రజలు పక్క గ్రామాలకు వెళ్లాలన్నా వాగు అడ్డంకిగా మారడడంతో అవస్థలు పడుతున్నారు. ప్రయాణ కష్టాలకు తోడు వాగు ఉధృతి పంట పొలాలను ముంచెత్తుతుండడంతో రైతులకు ఏటా తీరని నష్టం వాటిల్లుతోంది. ఇదే రహదారిలో చిన్నకొప్పెర్ల సమీపంలో నల్లవాగు ఉంది. ఈ వాగుకు వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వరదనీరు చేరి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పెద్దకొప్పెర్ల సమీపంలో కైపవాగుపై లోలెవల్ వంతెనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వంతెనపై మోకాలి లోతు నీరు చేరితే రాకపోకలు నిలిచి వివిధ గ్రామాల ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. మండలంలోని లింగాల సమీపంలో పాలేరు వాగుపై ఉన్న ఇరుకైన వంతెన అతి తక్కువ ఎత్తులో ఉండడంతో పాటు శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలంలో వంతెనపై వరద నీరు ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. మండలంలోని పెద్దకొప్పెర్ల– కలుగొట్ల గ్రామాల మధ్య ఇరుకుమాను వాగుపై ఉన్న లోలెవల్‌వంతెనలు ఆయా గ్రామాల ప్రజలు వేధిస్తున్నాయి. చిన్నపాటి వరదకే వాగు ఉప్పొంగుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు, రైతులకు రోజుల తరబడి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి చొరవ చూపాలి

బనగానపల్లె నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కావడంతో రహదారుల్లో వంతెనల కష్టాలు తీరుతాయని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. కోవెలకుంట్ల–లింగాల ఆర్‌అండ్‌బీ రహదారిలో ఉన్న వివిధ వాగులపై ఉన్న చిన్నపాటి వంతెనలతో ఎన్నో ఏళ్ల నుంచి ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి చొరవ తీసుకుని హైలెవల్ వంతెనల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసి వంతెన కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

వాగులపై హైలెవల్ వంతెనలు నిర్మించాలి



కోవెలకుంట్ల–లింగాల ఆర్‌అండ్‌బీ రహదారిలో కప్పల, నల్ల, కైప, పాలేరు, ఇరుకుమాను వాగులపై హైలెవల్ వంతెనలు నిర్మించాలి. చిన్నపాటి వర్షాలకే వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న లోలెవల్ వంతెనలతో పలు గ్రామాల ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాగులపై ఎతైన వంతెనలు ఏర్పాటు చేసి ప్రజల కష్టాలు తీర్చాలి.

–డీవీ శేషిరెడ్డి, లింగాల, కోవెలకుంట్ల

కప్పలవాగు ముంచెత్తుతోంది



ఏటా వర్షాకాలంలో కప్పలవాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. వరదనీరు వాగు వెంట ఉన్న పంట పొలాలను ముంచెత్తుతుండడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కప్పలవాగు చిన్నదైనా నీటి ప్రవాహ వేగం అధికంగా ఉంటుంది. కొందరు ప్రయాణికులు గమనించకుండా వాగు దాటేందుకు ప్రయత్నించి ప్రమాదాలకు గురి అవుతున్నారు.

–దినకర్, వల్లంపాడు, కోవెలకుంట్ల

గంగమ్మా.. కరుణించమ్మా



గంగమ్మ

కొలిమిగుండ్ల: వరుణుడి కరుణ కోసం రైతులు పూజలు, భజనలు చేస్తూనే ఉన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల గంగమ్మ ఆలయంలో సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో రైతులు, మహిళలు గంగమ్మకు 101 బిందెలతో జలాభిషేకం చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. ఈ ఏడాది బోర్లలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాధారం కింద సాగు చేసిన పంటలు వాడుముఖం పట్టాయన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంజామల: మండల పరిధిలోని రెడ్డిపల్లె సమీపంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. వీరిలో పేరుసోమముల గ్రామానికి చెందిన ఈడిగ గంగరాజు, అబ్దుల్ రఫీ, బాలనరసింహుడు, దేశన్న, ఈడిగ గజేయుడు, బోయ మోహన్, కోటపాడుకు చెందిన దస్తగిరి, శ్రీనువాసులు ఉన్నారు. వారి నుంచి రూ.17,640 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మట్కా బీటర్లపై కేసు నమోదు

కొలిమిగుండ్ల: మండలంలోని అంకిరెడ్డిపల్లెకు చెందిన మట్కా బీటర్లు వెంకట్రాముడు, పెద్దరాజులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. వీరిద్దరూ గ్రామంలో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. వారి నుంచి రూ.6710 నగదుతో పాటు మట్కా చీటీలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే కొలిమిగుండ్లలో మేగ గంగయ్య అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తుండగా దాడి చేశామన్నారు. 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు



పూజలు నిర్వహిస్తున్న విశ్వకర్ములు



పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు



బేతంచెర్లలో..

కోవెలకుంట్ల: పట్టణంలోని బనగానపల్లె చౌరస్తాలో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ యజ్ఞాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణపతి నవగ్రహ పూజ, పంచబ్రహ్మల పూజ, గణపతి హోమం, నవగ్రహ విశ్వబ్రహ్మ హోమం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కాలనీలకు చెందిన విశ్వబ్రాహ్మణులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కుమార్ ఆచారి, రాజేశ్వరాచారి, మురళీమోహన్, ముత్తోజ్ హరికృష్ణమాచారి, దామోదరాచారి, శ్రీనివాస ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉత్తరాది సుబ్బాచారి ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన విశ్వకర్ములు ప్రత్యేక పూజలు చేశారు. వాస్తు శిల్పి అయిన విశ్వకర్మ కృష్ణుడు పరిపాలించిన ద్వారకా నగరాన్ని, పాండవుల కోసం ఇంద్రప్రస్థ రాజభవనాన్ని నిర్మించడంతో పాటు దేవతలకు అనేకమైన ఆయుధాలను తయారు చేసి దివ్య వడ్రంగిగా పేరు గాంచారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస ఆచారి, విశ్వకర్మ సభ్యులు మహేష్, రామాచారి, విక్రమాచారి, ప్రసాద్, సుమంత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

డోన్: స్థానిక తారకరామనగర్‌లోని బ్రహ్మంగారి ఆలయంలో మంగళవారం విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వీరనారాయణ ఆచారి, నర్సయ్య ఆచారి, శివకృష్ణ, పలుకూరి సుబ్బయ్య, బ్రహ్మయ్య, కోయిలకొండ నాగరాజు, కొత్తపల్లె శ్రీను, వలి తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని జీఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వకర్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం వీరభద్రస్వామి వేషధారణ, నంది కోల సేవతో గ్రామోత్సవం నిర్వహించారు. విశ్వ బ్రాహ్మణులు వెంకటేశ్వర్లు ఆచారి, అశోక్, సుదర్శన్, లింగమూర్తి, రాజశేఖర్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లె రూరల్: బనగానపల్లెలోని 132/33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండల వ్యాప్తంగా ఈ నెల 19న(గురువారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ ఎస్.మద్దిలేటి మంగళవారం తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. వ్యవసాయానికి ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, రాత్రి 9 నుంచి 11 గంటల వరకు సరఫరా చేయనున్నట్లు ఏడీఈ వెల్లడించారు. బనగానపల్లె, పలుకూరు, యనకండ్ల, కైప, ఇల్లూరుకొత్తపేట గ్రామాల సబ్ స్టేషన్ల పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

డోన్: ద్రోణాచలం సేవాసమితి ఆత్మబంధువు సభ్యులు 100వ అనాథ శవానికి అంత్యక్రియలను నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన గుర్తు తెలియని యువకుడు (19) అనుమానాస్పద స్థితిలో స్థానిక రైల్వేగేట్ల వద్ద మృతిచెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు యువకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం సేవాసమితి ఆత్మబంధువు సభ్యులకు అందజేశారు. షాదిఖాన రాజు, గురుస్వామి, తాహెర్‌బాషా, పాణిపూరి మురళి, దాదాహుసేన్, కానిస్టేబుళ్లు సునీల్, రాములు హిందూ సంప్రదాయం ప్రకారం యువకునికి అంత్యక్రియలు నిర్వహించారు.



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆత్మబంధువు సభ్యులు

అల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

ప్యాపిలి: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. జిల్లా ప్రోగ్రాం అధికారిణి సునీత, తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. భోజనం చేసే ముందు, తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. డీటీ మారుతి, హెచ్ఎం సరళాదేవి, వైద్య సిబ్బంది రాఘవేంద్రగౌడ్, మనోహర్ రెడ్డి, అరుణబాయి పాల్గొన్నారు.

నులిపురుగులతో రక్తహీనత

డోన్ రూరల్: నులిపురుగులతో పిల్లలు రక్తహీనత బారిన పడే అవకాశం ఉందని.. నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని ఎద్దుపెంట జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేశారు. కడుపులో నులిపురుగులు ఉండడం వల్ల కడుపు నొప్పి, వికారం, రక్తహీనత వంటివి వస్తాయని తెలిపారు.



అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న అధికారులు

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

కోవెలకుంట్ల: ఆల్బెండజోల్ మాత్రలతో కడుపులోని నులిపురుగులను నివారించవచ్చని ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, మాయలూరు హెల్త్ ఆఫీసర్ లక్ష్మి అన్నారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. చేతులు శుభ్రం చేసుకోకుండా భోజనం చేయడం వల్ల చేతిపై ఉండే సూక్ష్మక్రిములు కడుపులోకి వెళ్లి వ్యాధులను కలుగజేస్తాయని తెలిపారు.

పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు

డోన్ టౌన్: పట్టణ రోడ్లపై ఆవులు, గేదెలు, ఇతర జంతువులను వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జయరాం హెచ్చరించారు. పశువుల యజమానులు బుధవారం సాయంత్రంలోగా రోడ్లపై సంచరిస్తున్న పశువులను తోలుకెళ్లాలన్నారు. లేకుంటే మున్సిపల్ చట్ట ప్రకారం సెక్షన్ 254, 255 అనుసరించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లపై సంచరిస్తున్న పశువులను ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గోశాలకు తరలిస్తామని తెలిపారు.

నూనె దుకాణాల్లో విజిలెన్స్ దాడులు

డోన్ టౌన్: పట్టణంలో వంట నూనె విక్రయించే దుకాణాల్లో విజిలెన్స్ సీఐ రామకృష్ణ, డోన్ తూనికలు, కొలతలశాఖ అధికారి ఖాజా హుస్సేన్ మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంగళ్లలో తూకాల్లో తేడాలు, నాసిరకం నూనెలను గుర్తించారు. వారికి నోటీసులు జారీ చేసి జరిమానా విధించారు.

చౌడేశ్వరీదేవికి సహస్ర దీపాలంకరణ సేవ



పూజలందుకుంటున్న అమ్మవారు

బనగానపల్లె రూరల్: పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని నందవరం గ్రామంలో చౌడేశ్వరీదేవికి సహస్ర దీపాలంకరణ సేవ, పల్లకీ సేవను మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



బేతంచెర్లలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



డోన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జయరాం



కోవెలకుంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



మోడల్ స్కూల్‌లో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

డోన్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర జీవితం గడపవచ్చని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. పాతబస్టాండ్ వద్ద జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఇండియా చిత్రం ఆకారంతో నిల్చొని పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛ డోన్ మున్సిపాలిటీకి ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ కోరారు. అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, ఎంఈఓలు ప్రభాకర్, రామనర్సప్ప, సామాజిక కార్యకర్త మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

బేతంచెర్ల: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల ప్రత్యేక అధికారి సంధ్య అన్నారు. మంగళవారం నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా బేతంచెర్లలో ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు మానవహారంగా నిలబడి పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు మన వంతు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

కోవెలకుంట్లలో స్వచ్ఛ ర్యాలీ

కోవెలకుంట్ల: పరిసరాల పరిశుభ్రతతోనే మానవ మనుగడ సాధ్యమని వక్తలు అభిప్రాయపడ్డారు. కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం స్వచ్ఛతహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని గాంధీ సెంటర్ నుంచి సర్పంచ్ మెట్ల సరళ, ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ఈఓ గోపీనాథ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. అమ్మవారిశాల, సంతమార్కెట్ మీదుగా పాండురంగ స్వామి దేవాలయం వరకు ర్యాలీ సాగింది. అక్కడ విద్యార్థినులు మానవహారంగా ఏర్పడి స్వచ్ఛత సేవా కార్యక్రమాలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల రోగాలు దరి చేరవన్నారు. వచ్చే నెల 2వ తేదీ వరకు స్వచ్ఛ సేవా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. అలాగే పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ సయ్యదున్నీ, ఈఓపీఆర్‌డీ రాధిక, ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, నాయకులు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, గడ్డం నాగేశ్వరరెడ్డి, అమడాల శంకరయ్య, గడ్డం వర ప్రసాద రెడ్డి, గజ్జెలరెడ్డి, ఎన్‌జీఓ వెంకటసుబ్బయ్య, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, రాజశేఖర్, కృష్ణదాసు, నాగేశ్వరరెడ్డి, సంజీవరెడ్డి, అన్నపూర్ణ, సంటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యం

బనగానపల్లె రూరల్: స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి విద్యార్థులు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆక్టోబరు 2వ తేదీ వరకు జరిగే పక్షోత్సవాల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు వివిధశాఖల ఉద్యోగులు, ప్రజాసంఘాలు పాల్గొని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి స్వచ్ఛతకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు, ఎంఈఓలు స్వరూప, శ్రీనివాసులు, ఐకేపీ ఏపీఎం తిరుపాల్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చిట్టెమ్మ, సాలమ్మ పాల్గొన్నారు.

గ్రామాల స్వచ్ఛతే లక్ష్యం

కొలిమిగుండ్ల: పరిసరాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా పరిశ్రమల మేనేజర్, ప్రత్యేకాధికారి శ్రీనివాసయాదవ్ అన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల మోడల్‌స్కూల్, తిమ్మనాయినపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మానవహారం, ర్యాలీ నిర్వహించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేశారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి పరిశుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. మొక్కలు నాటి వాటి సంరక్షించే బాధ్యత అందరిపై ఉందన్నారు. మన చుట్టూ ఉన్న పరిసరాలు బాగుంటే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఇళ్లలోని చెత్తను రోడ్లపై వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మురుగు నీటి కాల్వలను ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాల ఈశ్వరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, ఏపీఓ గంగన్న, ఎంఈఓ అబ్దుల్ కలాం పాల్గొన్నారు.

